
సాక్షి
బాపట్ల
గురువారం । 13 । జూన్ । 2024



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.70 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిమ్మకాయల ధరలు
తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,500, గరిష్ట ధర రూ.4,500, మోడల్ ధర రూ.3,500 వరకు పలికింది.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉత్తర నక్షత్రంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ కార్యాలయంపై టీడీపీ జెండా!


బొల్లాపల్లి : జాతీయ జెండా ఎగరాల్సిన ప్రభుత్వ కార్యాలయంపై పార్టీ జెండా దర్శనమిస్తోంది. మండలంలోని పేరూరుపాడు గ్రామ సచివాలయంపై తెలుగుదేశం పార్టీ జెండాను ఆ పార్టీ కార్యకర్తలు అత్యుత్సాహంతో కట్టారు. ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

విద్యార్థి కిట్లు అందజేయాలి
డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందించేందుకు విద్యార్థి కిట్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం ఆదేశించారు. జిల్లాలోని 1,54,946 మంది విద్యార్థులకు కిట్లు అందించనున్నట్టు వివరించారు. విద్యార్థులకు అవసరమైన కిట్లను ఇప్పటికే మండల పాయింట్ వద్ద నుంచి ఆయా పాఠశాలలకు చేరవేసినట్టు వెల్లడించారు. పాఠశాల పునఃప్రారంభం నాడే కిట్లు విద్యార్థులకు అందజేయాలని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు స్కూల్ అటెండెన్స్ యాప్ లాగిన్, పాస్‌వర్డ్‌లను సరిచూసుకోవాలని సూచించారు. విద్యార్థుల హాజరును యాప్‌లో సకాలంలో నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తొలిరోజు గైర్హాజరైన ఉపాధ్యాయులు, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాల కార్మిక వ్యతిరేక దిన ర్యాలీ


నరసరావుపేట: ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో చేపట్టిన అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకం, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.హనుమకుమార్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి, శిశు సంక్షేమ శాఖ అధికారి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, శంకరభారతీపురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులు నేడు విధుల్లో చేరాలి
గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు డీఎస్సీ 2008, 1998 మినిమం టైం స్కేల్‌పై పనిచేస్తున్న ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా గురువారం యథావిధిగా విధులకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పలు రైళ్లు పునరుద్ధరణ
లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో రద్దు చేసిన పలు రైళ్లను పునరుద్ధరించినట్లు సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్ కుమార్ బుధవారం వెల్లడించారు. విజయవాడ–రేపల్లె(07628), గుంటూరు–రేపల్లె (07786), రేపల్లె–తెనాలి(07873) రైళ్లను ఈనెల 21 నుంచి ఆగస్టు 8 వరకు పునరుద్ధరించినట్లు వివరించారు. విజయవాడ–మాచర్ల (07781) రైలును ఈనెల 22 నుంచి ఆగస్టు 13 వరకు, మాచర్ల–విజయవాడ(07782), తెనాలి–రేపల్లె(07874), రేపల్లె–తెనాలి (07875), తెనాలి–రేపల్లె(07876)రేపల్లె–గుంటూరు (07787), గుంటూరు–తెనాలి(07887), తెనాలి–రేపల్లె(07888) రైళ్లను ఈనెల 23 నుంచి ఆగస్టు 14 వరకు పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. తెనాలి–రేపల్లె(07889), మార్కాపురం–రేపల్లె(07890), తెనాలి–గుంటూరు(07282), గుంటూరు–విజయవాడ (07864) రైళ్లను ఈనెల 24 నుంచి ఆగస్టు 15 వరకు పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు.

బస్సెక్కుదాం.. బడికి పోదాం

- ప్రారంభమైన స్టూడెంట్ బస్‌పాస్‌ల పంపిణీ
- విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు
- ప్రత్యేక సర్వీసులు సైతం ఏర్పాటు చేస్తున్న ఆర్టీసీ



చీరాల బస్టాండ్‌లో బస్‌పాస్ కౌంటర్

చీరాల అర్బన్: నూతన విద్యా సంవత్సరం రావడంతో.. పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. 2024–25 నూతన విద్యాసంవత్సరానికి సంబంధించి స్టూడెంట్ బస్ పాస్‌ల జారీ ప్రక్రియను ఆర్టీసీ అధికారులు బుధవారం నుంచి ప్రారంభించారు. ఉచిత, రాయితీ బస్‌పాస్‌లను బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్లలో అందిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కౌంటరు తెరిచి విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చేస్తున్నారు ఆర్టీసీ అధికారులు.

విద్యకు ఉపయుక్తం..

వేసవి సెలవులు బుధవారంతో ముగిశాయి. గురువారం నుంచి పాఠశాలలు, కళాశాలలు యథావిధిగా కొనసాగనున్నాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత, రాయితీ బస్ పాసులను అందిస్తున్నారు. అలాగే మరికొన్ని పాఠశాలలకు ప్రత్యేకంగా బస్ సర్వీసులను ఏర్పాటు చేశారు. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థుల చదువుకు ఊతమిచ్చేలా ఏటా ఆర్టీసీ బస్సు పాస్‌లను జారీ చేస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా ఉచిత, రాయితీ బస్‌పాస్‌ల కోసం ఆన్‌లైన్ ద్వారా ఆర్టీసీ దరఖాస్తులను స్వీకరిస్తోంది. చీరాల ఆర్టీసీ డిపో పరిధిలో చీరాల, పర్చూరు నియోజకవర్గాలు ఉన్నాయి. చీరాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు రోజూ పాఠశాలలు, కళాశాలలకు వెళుతుంటారు. చీరాల డిపోలో గత ఏడాది స్టూడెంట్ పాస్‌లు 1390, రాయితీ బస్ పాస్‌లు 650 అందించారు. అలానే దివ్యాంగులకు ప్రత్యేకంగా 310 బస్‌పాస్‌లను అందించారు.

ఉచిత బస్‌పాస్‌లు..

ఆర్టీసీ ప్రతి ఏడాది ఉచిత పాస్‌లు అందిస్తోంది. బాలురకు 12 ఏళ్ల నిండే వరకు, బాలికలకు 18 ఏళ్ల నిండే వరకు ఉచిత పాస్‌లు అందిస్తున్నారు. వీటి సాయంతో విద్యార్థులు తన నివాస ప్రాంతం నుంచి 20 కిలోమీటర్ల వరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

ప్రత్యేక సర్వీసులు సైతం..

విద్యార్థులకు రాయితీ, ఉచిత బస్ పాస్‌లు ఇవ్వడమే కాకుండా ఆర్టీసీ విద్యార్థుల కోసం ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నారు. ఎక్కువ మంది విద్యార్థులుంటే పాఠశాలలకు ఉదయం, సాయంత్రం వేళల్లో రెండుసార్లు ప్రత్యేక సర్వీసును నడుపుతున్నారు. చీరాల డిపో నుంచి వాడరేవులోని ఏఎంజీ స్కూల్, ఈపూరుపాలెం బైపాస్ వద్ద గల ఏపీ మోడల్ స్కూల్‌కు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో చీరాల ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సు నడుస్తోంది. అలాగే బాపట్లలోని సూర్యలంక కేంద్రీయ విద్యాలయానికి చీరాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు వెళుతుంటారు. వీరి కోసం ఉదయం, సాయంత్రం బాపట్ల డిపో నుంచి చీరాలకు ప్రత్యేక సర్వీసును నడుపుతున్నారు.

కావల్సినవి..
విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి ధ్రువీకరణ పత్రం, పాస్ ఐడెంటిటీ కార్డు నిమిత్తం రూ.50 చెల్లించాలి. ఈ బస్ పాస్‌లలో నెలవారీ, మూడు నెలలకు ఒకసారి, సంవత్సరం పాస్‌ను అందిస్తారు. ఇంటి నుంచి విద్యాసంస్థకు మధ్య ఉన్న దూరం, సమయాన్ని బట్టి స్టూడెంట్ పాస్‌ల ధర నిర్ణయిస్తారు. మొదటిసారి ఏ కాలపరిమితితో పాస్ తీసుకున్నారో తర్వాత రెన్యువల్ పాస్ కూడా అదే కాలపరిమితికి జారీ చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసం ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి బస్ పాస్‌ల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. నిర్ణీత నగదు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించిన తర్వాత ప్రింట్ తీసుకుని బస్‌పాస్ కౌంటర్‌లో అందిస్తే ఆన్‌లైన్ కోడ్ నంబర్ ద్వారా పాస్‌లను జారీ చేస్తారు. అలానే దివ్యాంగులకు కూడా రాయితీ బస్ పాస్‌లు అందిస్తున్నారు.

అర్హులందరికీ ఉచిత పాస్‌లు..


ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గత ఏడాది చీరాల డిపోలో స్టూడెంట్ పాస్‌లు 1390, ఉచిత బస్ పాస్‌లు 650 అందించాం. గత ఏడాది కంటే ఈ ఏడాది జారీ చేసే పాస్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులు బస్‌పాస్‌ల కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేశాం. పాఠశాల, కళాశాల యాజమాన్యం నుంచి ధ్రువపత్రాన్ని తీసుకువచ్చిన వారికి బస్‌పాస్‌లను అందిస్తున్నాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– జె.శ్యామల, డిపోమేనేజర్, చీరాల

జిల్లాలో ఇద్దరు అమాత్యులు

- మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన గొట్టిపాటి, అనగాని
- ఇద్దరికీ తొలిసారి పదవి దక్కిన వైనం
- ఆనందంలో అనుచరవర్గం


గొట్టిపాటి రవికుమార్


అనగాని సత్యప్రసాద్

సాక్షి ప్రతినిధి,బాపట్ల: చంద్రబాబు మంత్రివర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. బాపట్ల జిల్లాకు చెందిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌లు బుధవారం చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరిద్దరికీ మంత్రిపదవులు దక్కనున్నాయని ఓట్ల లెక్కింపు అనంతరం పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ఎట్టకేలకు ఇద్దరూ మంత్రులు అయ్యారు.

వరుసగా ఐదుసార్లు గెలిచిన గొట్టిపాటి..

చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన గొట్టిపాటి రవికుమార్ చంద్రబాబు, లోకేష్‌లకు దగ్గరగా ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మంత్రివర్గంలోకి తీసుకుంటామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్‌లు బహిరంగ వేదికలపై గొట్టిపాటికి మాటిచ్చారు. ఆ మేరకు గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించారు. మార్టూరు నియోజకవర్గంనుంచి 2004లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన గొట్టిపాటి రవికుమార్ ఆ తర్వాత 2009లో అద్దంకి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నిక కాగా 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం టీడీపీలో చేరిన గొట్టిపాటి 2019, 2024లలో అద్దంకి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

బీసీ కోటాలో అనగానికి..
బీసీ సామాజికవర్గానికి చెందిన రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు సైతం చంద్రబాబు మంత్రి వర్గంలో స్థానం లభించింది. బుధవారం ఆయన మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. గౌడ సామాజికవర్గానికి చెందిన అనగాని రేపల్లె నుంచి 2014, 2019, 2024లలో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనగానికి చంద్రబాబు, లోకేష్‌లతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయనకు బీసీ కోటాలో మంత్రిపదవి లభించినట్లు తెలుస్తోంది. జిల్లానుంచి అటు గొట్టిపాటి రవికుమార్‌కు, అనగాని సత్యప్రసాద్‌లకు మంత్రిపదవులు లభించడంపై వారి అనుచరులతోపాటు జిల్లాలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా నుంచి ఇద్దరికి మాత్రమే మంత్రివర్గంలో స్థానం లభించిన నేపథ్యంలో మంత్రి పదవులు ఆశించిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులు తీవ్ర నిరాశకు గురైనట్లు తెలుస్తోంది. మంత్రులకు శాఖల కేటాయింపు జరగాల్సివుంది.

15న సుద్దాల అశోక్ తేజకు ఎక్స్‌రే శ్రీశ్రీ అవార్డు ప్రదానం


విజయవాడ కల్చరల్: సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు ఈనెల 15వ తేదీన ఎక్స్‌రే శ్రీశ్రీ అవార్డు అందజేస్తామని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాకవి శ్రీశ్రీ 41వ వర్ధంతి సందర్భంగా విజయవాడ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగే కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురించిన 'నేను సహితం' గ్రంథాన్ని అశోక్ తేజ ఆవిష్కరిస్తారని తెలిపారు.

అంగరంగా వైభవం



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ క్లైమెట్ చేంజ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎ. శ్రీనివాస్, వీసీ డాక్టర్ శారదజయలక్ష్మిదేవి తదితరులు

- ఎన్జీ రంగా వర్సిటీ డైమండ్ జూబ్లీ వేడుకలు
- శాస్త్రవేత్తలు, రైతులకు బహుమతులు
- కొత్త వంగడాల ఆవిష్కరణకు మరింత కృషి చేస్తామని ప్రతిన

గుంటూరు రూరల్: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు లబ్ధి చేకూరే నూతన వంగడాల ఆవిష్కరణ దిశగా శాస్త్రవేత్తలు మరింత కృషి చేసేందుకు ప్రతినబూనాలని ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ క్లైమెట్ చేంజ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నగర శివార్లలోని లాం నందున్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 60వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదజయలక్ష్మిదేవి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయ రంగం ముందున్న సవాళ్లను, చేపట్టాల్సిన చర్యలను వివరించారు. నాబార్డ్ డీజీఎం ఎంఎస్‌ఆర్ చంద్రమూర్తి మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం నాబార్డ్ అందించిన ఆర్థిక సహాయాన్ని వివరించారు. అధిక, సుస్థిర దిగుబడుల సాధనకు సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇండియన్ స్టాండర్డ్ బ్యూరో డైరెక్టర్, హెడ్ ఎం.ఎ.జె. వినోద్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నాణ్యమైన విద్యను అందించటంలో, బలమైన సాంకేతికతను రూపొందించటంలో, పాటించిన ప్రమాణాలు చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదజయలక్ష్మిదేవి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం గత 60 సంవత్సరాల్లో బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో సాధించిన ప్రగతిని వివరించారు. రాష్ట్ర విభజన తరువాత అతి తక్కువ సమయంలో విశ్వవిద్యాలయం విడుదల చేసిన నూతన వంగడాలు, విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో 16 అవార్డులను సాధించిందని తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలు అధికారులకు బహుమతులు అందజేశారు. నూతన ఆవిష్కరణల బ్రోచర్‌లను ఆవిష్కరించారు. వీరపనేని నరశింహం మెమోరియల్ గోల్డ్ మెడల్ అవార్డు, వల్లభనేని లక్ష్మమ్మ, వల్లభనేని సుబ్బనర్సయ్య గోల్డ్ మెడల్లను డాక్టర్ టీఎం హేమలత సొంతం చేసుకోగా, డాక్టర్ ఎ.వి.కృష్ణయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను డాక్టర్ సీహెచ్‌ఎస్ రామలక్ష్మి, నీలకంఠాపురం కావేరప్ప గోల్డ్ మెడల్‌ను డాక్టర్ బీఎస్‌వీఎస్‌ఆర్ రవికుమార్, ఈదర సుబ్బాయమ్మ, ఈదర వెంకటరావు మెమోరియల్ గోల్డ్‌మెడల్, డా.ఎడ్లపల్లి సతీష్, వీఆర్ దుర్గాంబ చారిటబుల్ ట్రస్ట్ గోల్డ్‌మెడల్‌లను డాక్టర్ పీ శ్రీదేవి, రైతు వరద దుర్గారావులకు అందజేశారు. కేసీపీ లిమిటెడ్ గోల్డ్ మెడల్లను డాక్టర్ పీ కిషోర్, రైతులు జంగా సంజీవరెడ్డి, కంటేటి పిచ్చయ్య, పాశాల కృష్ణలకు అందజేశారు. శాస్త్రవేత్తలు, అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముందుంది ముహూర్తం

- శ్రావణ మాసం వరకు నిరీక్షణే
- ఆగస్టులో బలమైన లగ్నాలు
- వందలాది మంది ఉపాధికి విఘాతం

అద్దంకి: ఈ ఏడాది ఆగస్టు ఐదో తేదీ వరకు మూఢం ఉండడంతో పెళ్లి ముహూర్తాలకు బ్రేక్ పడింది. కొత్త సంవత్సరాది (ఉగాది) తర్వాత ఏప్రిల్ తొమ్మిదో తేదీ నుంచి ముహూర్తాలు ప్రారంభమై 26వ తేదీతో ముగిశాయి. ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రవేశించడంతో రెండున్నర నెలలుగా వివాహాలు, ఉపనయనాలు, గృహప్రవేశాలు వంటి శుభ కార్యాలు నిలిచిపోయాయి. మే 7 అనగా చైత్ర బహుళ చతుర్ధశి నుంచి జూన్ ఏడో తేదీ వరకూ గురు మౌఢ్యమి నడిచింది. ప్రస్తుతం జూలై 8వ తేదీ ఆషాఢ శుద్ధ తదియ వరకూ శుక్రమౌఢ్యమి (మూఢం) ఉంది. వరుసగా గురు, శుక్రమౌఢ్యాలు రావడంతో సుమారు రెండు నెలలకుపైగా ముహూర్తాలు లేకుండా పోయాయని పురోహితులు చెబుతున్నారు. మరో వైపు జూలై ఐదో తేదీ నుంచి ఆషాడ మాసం ప్రారంభం కానుంది. ఇది ఆగస్టు ఐదో తేదీ వరకు ఉంటుంది. అందువల్ల ఆ నెలలోనూ ముహూర్తాలు ఉండవు.



మూఢమైనా ఇవి చేసుకోవచ్చు ..

మూఢం నడిచినా ఇదివరకే మొదలుపెట్టిన గృహాలు, పాత పనులు, అన్నప్రాశన, అక్షరాభ్యాసం, నామకరణం, నూతన వ్యాపారా ప్రారంభోత్సవాలు, సీమంతాలు, రిజిస్ట్రేషన్లు, వంటి పనులు చేసుకోవచ్చు.

భాద్రపద మాసంలోనూ నో..

సెప్టెంబర్ నాలుగో తేదీ నుంచి అక్టోబర్ మూడో తేదీ వరకు భాద్రపద మాసం కావడంతో ఆ నెలలోనూ వివాహ ముహూర్తాలు ఉండవు.

శ్రావణ మాసంలో దివ్యంగా..

శ్రావణ మాసం ఆగస్ట్ నెల ఏడో తేదీ నుంచి ప్రారంభమై 28వ తేదీ వరకు ఉంటుంది. ఈ నెలలోనే దివ్యమైన ముహూర్తాలున్నట్లు పురోహితులు చెబుతున్నారు. ఆగస్టులో 7, 12, 13, 19, 26, 27, తేదీల్లో దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి.

వందలాది మంది ఉపాధికి గండి
గత రెండున్నర నెలలుగా ముహూర్తాలు లేకపోవడంతో వందలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. వివాహాలపై ఆధారపడి జీవించే ఎన్నో వృత్తుల వారికి బతుకుదెరువు కరువైంది. కల్యాణ మంటపాలు, క్యాటరింగ్, వంటవారు, పురోహితులు, వీడియో గ్రాఫర్స్, ట్రావెల్స్, కార్లు, ఐస్‌క్రీమ్‌లు, మినరల్ వాటర్, ఈవెంట్ క్రియేటర్లు, డెకరేషన్స్, లైటింగ్, కూరగాయలు, కిరాణా, వస్త్ర, వెండి, బంగారు, షామియానా, మాంసం దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సాంస్కృతిక కళాకారుల జీవనానికి విఘాతం కలిగింది. అడపా దడపా చిన్న చిన్న ఫంక్షన్లు వస్తున్నా పెళ్లిళ్ల అంత గిరాకీ లేక వారు ఉసూరుమంటున్నారు. ఆగస్టు ఏడో తేదీ వరకు తమకు పూట గడవటం కష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీగానే ఉన్నాం..
పెళ్లి ముహూర్తాలు ఉంటే మాకు గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాం. సంపాదన లేక ఇబ్బందులు పడుతున్నాం. అయినా తప్పదు. ముహూర్తాలు వచ్చే వకు ఎలాగోలా బండి నడపాల్సిందే.

– వెంకటేశ్వర్లు, క్లారినెట్ వాయిద్యకారుడు, అద్దంకి

చిన్న ఫంక్షన్లు తప్ప బుకింగ్ లేదు..
చిన్న ఫంక్షన్లు మినహా పెళ్లిల్లు లేకపోవడంతో మంటపాన్ని ఎవరూ బుక్ చేసుకోవడం లేదు. ఈ సంవత్సరం ముహూర్తాలకు బాగా బ్రేక్ పడింది. సీజన్‌పై ఆధారపడిన వారందరూ ఇబ్బందులు పడుతున్నారు.

–కె.రామారావు, కల్యాణ మండప యజమాని, అద్దంకి


ఆగస్టు వరకు ఆగాల్సిందే..


మూఢమి వెళ్లే దాక ముహూర్తాలు లేవు. మళ్లీ ఆగస్టులో దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి. అప్పటివరకు మాకు ఇబ్బందులు తప్పవు. దైవ కార్యక్రమాలతోపాటు ఏదో చిన్న కార్యక్రమాలు మాత్రమే ఉంటాయి.

– సుబ్రహ్మణ్యం, పురోహితుడు, బల్లికురవ

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించండి

కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికశాఖ అధికారులు

బాపట్లటౌన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంలో భాగంగా బుధవారం పట్టణంలో కార్మికశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వారినందరినీ బాలలుగానే గుర్తించాలని, ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. పిల్లలు పనిలో ఉండకుండా బడికి వెళ్లే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బాపట్ల లేబర్ ఆఫీసర్ ఆర్.అబ్రహం, సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కొమరాబత్తిన రవి ప్రదీప్, సీడీపీఓ పురుషోత్తం, స్వచ్ఛందసేవా సంస్థ సిబ్బంది బడుగు కిషోర్, నాగరాజు, ఐసీడీఎస్ సిబ్బంది రోజ్ లీనా, రాము, సులోచన, పారా లీగల్ వలంటీర్స్ రవికుమార్, ప్రసాద్, రాజారావు, శ్యామ్యూల్ పాల్గొన్నారు.

30,471 బస్తాల మిర్చి విక్రయం
కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 30,238 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,471 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 17,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 19,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 12,608 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అలరిస్తున్న నాటికలు



పక్కింటి మొగుడు నాటికలోని ఓ సన్నివేశం

చీరాల అర్బన్: కళాంజలి, చీరాల సాంస్కృతిక మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రస్థాయి జాతీయ నాటకోత్సవాల్లో ప్రదర్శిస్తున్న నాటికలు ఆహూతులను అలరిస్తున్నాయి. చీరాల కేజీఎం గరల్స్ హైస్కూల్ ప్రాంగణంలో దివంగత పోలవరపు జగదీశ్వరరావు కళావేదికపై జరుగుతున్న నాటకోత్సవాల్లో బుధవారం అరవింద ఆర్ట్స్, తాడేపల్లి వారిచే 'మనస్విని' నాటిక ప్రదర్శించారు. నాటికకు వల్లూరి శివప్రసాద్ రచన, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు. డబ్బే ప్రధానమంటున్న ఈ రోజుల్లో మానవ సంబంధాల్లోని మానవీయ విలువలన్ని, ఉన్నత సంస్కారాన్ని ఆవిష్కరిస్తూ డబ్బు కన్నా మానవ సంబంధాలే ఎంతో ఉన్నతమైనవనే సారాంశంతోకూడిన నాటిక ఆలోచింపజేసింది.

- పండు క్రియేషన్స్ కొప్పోలువారు 'పక్కింటి మొగుడు' నాటికను ప్రదర్శించారు. నాటికకు రచన గోవిందరాజుల నాగేశ్వరరావు అందించగా దర్శకత్వం బాలినేని నాగేశ్వరరావు వహించారు. ఇతరుల అవసరాలను అవకాశంగా తీసుకొని ఎదుటి వాళ్లను బ్లాక్‌మెయిల్ చేయవద్దనే సారాంశంతో 'పక్కింటి మొగుడు' నాటికను ప్రదర్శించారు. ప్రదర్శన అనంతరం దర్శకులకు జ్ఞాపికలను అందించారు. నాటకోత్సవాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, తిరుమలశెట్టి సాంబశివరావు, వలివేటి మురళీకృష్ణ, బీరం సుందరరావు, కోశాధికారి దరియా సాహెబ్, వీరభద్రాచారి, ఎం.లూకా, భాగి కృష్ణమూర్తి, వడలి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనం అదుపుతప్పి కిందపడి యువకుడు మృతి

రేపల్లె రూరల్: రహదారి ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ నజీర్‌బేగ్ వివరాల మేరకు మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన బెజవాడ వంశీ (23) మంగళవారం రాత్రి ఇంటి నుంచి పేటేరు సమీపంలోని నేషనల్ హైవే పక్కనే ఉన్న టీ స్టాల్‌లో టీ తాగి ఇంటికి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెనుమూడి సమీపంలో వాహనం అదుపు తప్పటంతో వంశీ కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు అంబులెన్స్ సహాయంతో రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోలలపూడిలో మరో వ్యక్తి..



మార్టూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ శ్రీనివాసరావు, స్థానికుల వివరాలు ఇలా ఉన్నాయి.. ద్రోణాదుల గ్రామానికి చెందిన పంది ఏసుబాబు (38) మంగళవారం రాత్రి ద్రోణాదుల నుంచి కోలలపూడికి ఓ శుభ కార్యం నిమిత్తం బయలుదేరాడు. అనంతరం తిరిగి స్వగ్రామం వెళ్లే క్రమంలో కోలలపూడి ఎస్సీ కాలనీ అంబేడ్కర్ బొమ్మ వద్ద వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో ఏసుబాబు తలకు రాయి తగలడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కొద్దిసేపటికి స్థానికులు గమనించి మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. జోజి బాబు బుధవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇక్కట్లు

అద్దంకి రూరల్: చంద్రబాబు నాయుడి ప్రమాణ స్వీకారం చూసేందుకు టీడీపీ నాయకులు బుధవారం తరలివెళ్లారు. ఆ కార్యక్రమాన్ని ముగించుకుని సాయంత్రం ఎవరి గమ్యాలకు వారు చేరుకునే క్రమంలో అద్దంకి నుంచి వెళుతున్న వాహనాలతో స్థానిక భవానీ సెంటర్‌లో ట్రాఫిక్‌జామ్ కావటంతో పట్టణంలోని నామ్ రహదారిపై రెండువైపులా రెండు కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అలాగే సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం జంక్షన్‌వద్ద ట్రాఫిక్ జామ్‌తో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీగా రవి

రాజుపాలెం: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా మండలంలోని అనుపాలెం గ్రామానికి మందా విశాలక్షి రవి నియమితులైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు బుధవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు అభివృద్ధికి పడాలన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు అన్నివిధాలుగా తమ సంఘం అండగా ఉంటుందని అన్నారు.

బంగారు భవితకు బాటలు..!

- ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మేలు
- ఇంటింటికీ సర్వే నిర్వహించిన ఈఐఆర్‌పీలు
- సమగ్ర శిక్షా ద్వారా ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి
- జిల్లా వ్యాప్తంగా 134 మంది బడి ఈడు పిల్లల గుర్తింపు
- జిల్లాలో ముగిసిన ఇంటింటి సర్వే ప్రక్రియ



యడ్లపాడులో ప్రత్యేక అవసరాల పిల్లల సర్వే చేస్తున్న సహిత ఉపాధ్యాయురాలు

సత్తెనపల్లి: జిల్లాలో చదువుకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించేందుకు సహిత ఉపాధ్యాయులు చేపట్టిన ఇంటింటి సర్వే ముగిసింది. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎన్‌సీఈఆర్టీ) రూపొందించిన ప్రశస్త యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. శారీరక, మానసిక, దివ్యాంగుల కోసం కొన్నాళ్ల క్రితం భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బ్రెయిలీ నైపుణ్యాలు పెంపొందించడం, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, తదితర సేవలు అందిస్తున్నారు. ఇక మీదట వీటిని పాఠశాలల్లో విలీనం చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. వారు కూడా ఇతర విద్యార్థులతో కలసి చదువుకునే అవకాశం ఉంది.

ముగిసిన సర్వే ప్రక్రియ...

జిల్లాలో 28 మండలాల పరిధిలో 28 భవిత కేంద్రాలు ఉండగా అందులో 324 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం భవిత కేంద్రం ఉపాధ్యాయులు మే 1వ తేదీ నుంచి ఈ నెల 9వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక సర్వే నిర్వహించారు. జిల్లాలో మరో 134 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించారు. జిల్లాలో మొత్తం 458 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు.

ఉన్నత విద్యకు అవకాశం...

భవిత కేంద్రాల ద్వారా 5 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు కలిగిన దివ్యాంగ చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్నారు. కేంద్రాల విలీనం తరువాత విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో వీరికి సదుపాయాలు కల్పించనున్నారు. చదువుకునే ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు మంజూరు అవుతాయి. పాఠశాలల్లో చేరే వారికి నెలకు రూ.300 చొప్పున రవాణా చార్జీలు ఇస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబులు అందజేస్తారు. 9,10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం కింద ఏడాదికి రూ. 12 వేలు చొప్పున వరుసగా నాలుగేళ్ల వరకు అందుతుంది. ప్రతిభావంతులకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు ఉంటాయి. వైకల్య శాతం అధికంగా ఉన్న వారికి పింఛన్ లభిస్తుంది. బస్సులు, రైళ్లలో రాయితీ ప్రయాణానికి అవకాశం ఉంటుంది. పాఠశాలకు రాలేని వారికి ఇంటికే ఉపాధ్యాయులు వెళ్లి అవసరమైన శిక్షణ ఇస్తారు.

సాధారణ విద్యార్థులతో సమానం



ప్రజల్లో సరైన అవగాహన లేక ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లి దండ్రులు వీటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. అంగవైకల్యంతో పుట్టిన తమ పిల్లలను నాలుగు గోడల మధ్యనే పరిమితం చేస్తున్నారు. ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు జిల్లాలో చేపట్టిన సర్వే ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 134 మందిని గుర్తించాం.

–కె. శ్రీనివాసరావు, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్, పల్నాడు

ఉద్యోగ సాధనే ధ్యేయం కావాలి..



హాజరైన కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు



శిక్షణ తరగతుల ప్రారంభ సభలో మాట్లాడుతున్న డాక్టర్ వద్లమాని రవి

బ్యాంక్ ఉద్యోగాలకు శిక్షణ ప్రారంభం

పెదకాకాని: అనుకున్నది సాధించాలనే లక్ష్యం అందరికీ ఉండాలని ప్రముఖ రొటేరియన్, చార్టెడ్ అకౌంటెంట్ డాక్టర్ వద్లమాని రవి అన్నారు. పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామ శివారులోని కౌండిన్యపురంలోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగాల శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ సభకు రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బుధవారం జరిగిన ఈ సభకు అకాడమీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ అధ్యక్షత వహించారు. డాక్టర్ వద్లమాని రవి మాట్లాడుతూ.. ఎలా పుట్టినా ఏ స్థాయికి చేరామన్నదే ముఖ్యమన్నారు. అనుకున్న దానికంటే ఎక్కువ స్థాయిలో లక్ష్యాన్ని పెట్టుకుంటే విజయానికి ప్రయత్నం చేయాలన్నారు. తాము రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. చేసే ప్రయత్నంలో మంచి ఉంటే ప్రకృతి కూడా సహకరించి మనల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. ఆత్మవిశ్వాసం ఉంటే విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు. అకాడమీ అకాడమిక్ డీన్ వై సత్యనారాయణ మాట్లాడుతూ మనిషికి ఏ రంగంలోనైనా విజయమే ముఖ్యమని, అదే కుటుంబానికి కూడా గెలుపు ప్రసాదిస్తుందని పేర్కొన్నారు. పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వంటి సంస్థలు ఆర్థిక, శిక్షణపరంగా ఎంతో సహాయ , సహకారాలు అందించటం అభినందనీయమన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ నారాయణ మాట్లాడుతూ ఒక సమాజ అభివృద్ధి అక్కడి విద్య, ఉద్యోగాలపైనే ఆధారపడి ఉంటుందనే ఉద్దేశంతోనే కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కౌండిన్య ఐఏఎస్ అకాడమీలను స్థాపించామన్నారు. మహిళా అభ్యర్థులను ప్రోత్సహించాలని దాతల సహకారంతో ఉచిత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు ఎవరైనా అకాడమీ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి దాసరి బాలకృష్ణ, అధ్యాపకులు కోటేశ్వరరావు, అమర్నాథ్, అరుణ కిరణ్, సందీప్, అకాడమీ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఫరూక్



నాదెండ్ల: గణపవరం సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని కేంద్రియ విద్యాలయ(ఇర్లపాడు) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా అహ్మద్ ఫరూక్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సునీతాసింగ్ బదిలీ అయ్యారు. గతేడాది అక్టోబర్‌లో బదిలీపై ఇక్కడకు వచ్చిన సునీతాసింగ్, ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని భోపాల్ రీజియన్ గ్వాలియర్-1కు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం సీనియర్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్ అహమ్మద్ ఫరూక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈయన ఇటీవల గుంటూరు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి



ఒడ్డుకు కొట్టుకొచ్చిన గిరీష్ మృతదేహం

చీరాల: సముద్రతీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన యువకుడు అలల తాకిడికి గల్లంతై మృతి చెందిన సంఘటన బుధవారం రామాపురం బీచ్‌లో చోటు చేసుకుంది. తాడేపల్లి గూడెంకు చెందిన గిరీష్ (21) బుధవారం రామాపురం బీచ్‌కు వచ్చాడు. సముద్రంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి గల్లంతయ్యాడు. కొద్ది సమయానికే అతని మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. సమాచారం అందుకున్న వేటపాలెం పోలీసులు మృతుడి వివరాలను నమోదు చేసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా పనిచేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల కోరారు. పల్నాడు రోడ్డులోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్ అధ్యక్షత వహించారు. మంజుల మాట్లాడుతూ, పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియాలు రెండు కొనసాగించాలని, పాఠశాల విద్యారంగానికి గొడ్డలి పెట్టులా మారిన జీఓ 117ను రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ శక్తిని రాజకీయపార్టీలు గుర్తించి మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, గుంటూరుజిల్లా అధ్యక్షుడు బసవలింగారావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో సెక్యూరిటీ గార్డు మృతి

- యడ్లపాడు సినిమాహాల్ సెంటర్లోని అద్దె ఇంట్లో ఘటన
- మూడు రోజులు ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

యడ్లపాడు: వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగు చూసింది. పోలీసులు అందించిన వివరాలు... ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గండెపల్లి గ్రామంలో కళ్లజోళ్ల షాపు నడిపే అవివాహితుడైన మట్టా నాగిరెడ్డి(40) ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం యడ్లపాడు గ్రామానికి ఒంటరిగా వలస వచ్చాడు. అప్పటి నుంచి మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని వసంత నూలుమిల్లులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. యడ్లపాడు సినిమాహాల్ సెంటర్లోని షేక్ మీరాబి ఇంటి పై అంతస్తులో అద్దెకు ఉంటున్నాడు. అదే భవనంలో కింది పోర్షన్‌లో ఉంటున్న మీరాబి కుటుంబ సభ్యులకు పైనుంచి దుర్వాసన రావడంతో పైకి వెళ్లి చూడగా తమ ఇంటి నుంచే వస్తున్నట్లు పసిగట్టారు. అనుమానంతో కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. నాగిరెడ్డి అన్న సీతారామిరెడ్డి, మేనమామ బెజవాడ నరసింహారెడ్డి వచ్చి ఇంటి తలుపు కొట్టగా లోపల గడియ బిగించి ఉంది. దానిని పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా బెడ్‌రూంలో మంచంపై నాగిరెడ్డి శవమై కనిపించాడు. విపరీతమైన దుర్గంధంతో పాటు శరీరం ఆనవాళ్లు గుర్తుపట్టలేనంతగా ఉబ్బి పురుగులు పట్టింది. సమీపంలోనే క్వార్టర్ మద్యం ఖాళీ సీసా లభించింది. ఘటనా స్థలికి సిబ్బందితో చేరుకున్న యడ్లపాడు ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ వివరాలను సేకరించారు. నాగిరెడ్డి అన్న సీతారామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

సుదీర్ఘకాలం తర్వాత తెనాలికి మంత్రి పదవి

- క్యాబినెట్‌లో నాదెండ్ల మనోహర్‌కు అవకాశం
- మంత్రిగా ప్రమాణస్వీకారం



మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న నాదెండ్ల మనోహర్

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలికి సుదీర్ఘ కాలం తర్వాత రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం లభించింది. కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా గెలిచిన నాదెండ్ల మనోహర్ రాష్ట్ర మంత్రిగా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు.

రాజకీయ చైతన్యానికి నిలయమైన తెనాలి నుంచి ఎందరో రాజకీయ ఉద్దండులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో మంత్రులుగా సమర్థత నిరూపించుకున్నారు. తెనాలి నియోజకవర్గం నుంచి మంత్రి పదవులను చేపట్టినవారు కొందరే. నియోజకవర్గంలో 1952 నుంచి ఇప్పటి వరకు 16 సార్లు ఎన్నికలు జరగ్గా, కేవలం నలుగురు మాత్రమే మంత్రి పదవులను చేపట్టారు. అందులో ముగ్గురు మంత్రులుగా బాధ్యతలు నిర్వహించగా, మరొకరు అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో అప్పటి తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ హోదాలో ఉన్న విషయం తెలిసిందే.

2004, 2009 ఎన్నికల్లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినపుడు నాదెండ్ల మనోహర్ ఆ రెండు ఎన్నికల్లోనూ తెనాలి అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినపుడు నాదెండ్ల మనోహర్‌కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ లైబ్రరీ కమిటీ చైర్మన్ పదవి వరించింది. తర్వాత క్యాబినెట్ హోదాతో అసెంబ్లీ డెప్యూటీ స్పీకర్ పదవిని చేపట్టారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ పదవిని నిర్వర్తించారు.

అనంతర రాజకీయ పరిణామాలతో వైఎస్సార్ సీపీ ఆవిర్భవించింది. 2014లో కాంగ్రెస్ పార్టీ తరఫున, 2019లో జనసేన అభ్యర్థిగా తెనాలి నుంచి పోటీచేసిన నాదెండ్ల మనోహర్, ఆ రెండు ఎన్నికల్లో ఓటమి చెందారు. 2024 వచ్చేసరికి రాజకీయ పరిణామాలు శరవేగంగా మారిపోయాయి. జనసేన పీఏసీ చైర్మన్‌గా జనసేన, టీడీపీల మధ్య పొత్తులో మనోహర్ కీలకపాత్ర పోషించినట్లు చెబుతారు. బీజేపీతో కూడా పొత్తు కుదరటంతో జనసేన, టీడీపీ, బీజేపీలు కూటమిగా 2024 ఎన్నికల్లో పోటీచేసి, అధికారాన్ని చేపట్టాయి. జనసేనలో నెంబర్ టూ అయిన తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌కు సహజంగానే మంత్రి పదవి లభిస్తుందని అందరూ ఊహించారు. ఆ ప్రకారంగానే గన్నవరం ఐటీ పార్కులో బుధవారం అట్టహాసంగా జరిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రులుగా ప్రమాణం చేసిన వారిలో నాదెండ్ల మనోహర్ కూడా ఉన్నారు. మనోహర్‌కు కీలక మంత్రిత్వ శాఖ లభిస్తుందనేది కూడా వాస్తవమే. 2009–14 మధ్య అసెంబ్లీ స్పీకర్‌గా చేసిన నాదెండ్ల మనోహర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చివరి స్పీకర్‌గా గుర్తింపును పొందిన విషయం తెలిసిందే. 2014లో రాష్ట్ర విభజన జరిగిన పదేళ్ల తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్‌కు తెనాలి నుంచి తొలిగా మంత్రి పదవిని చేపట్టిన ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ కావటం మరో విశేషం!

1952 ఎన్నికల్నుంచి తెనాలిలో మూడుసార్లు పోటీచేసి గెలిచిన ఆలపాటి వెంకట్రామయ్య రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. తర్వాత ఆయన కుమార్తె దొడ్డపనేని ఇందిర కూడా మూడు పర్యాయాలు తెనాలి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆమెకు మంత్రి పదవి దక్కలేదు. తర్వాత 1983, 1985 ఎన్నికల్లో తెనాలి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అన్నాబత్తుని సత్యనారాయణ ఎన్టీ రామారావు మంత్రివర్గంలో మంత్రిగా చేశారు. 1989లో తెనాలి నుంచి నాదెండ్ల భాస్కరరావు పోటీచేసి విజయం సాధించినా, డాక్టర్ చెన్నారెడ్డి క్యాబినెట్‌లో స్థానం దక్కలేదు.

2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభంజనంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. 2009లోనూ మళ్లీ విజయాన్ని నమోదు చేసింది. ఆ రెండుసార్లు తెనాలి నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన నాదెండ్ల మనోహర్ అసెంబ్లీ స్పీకర్‌గా చేశారు. మళ్లీ ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్‌కు మంత్రిగా నియమితులయ్యారు.

కార్మికులకు శ్రామిక్ సు‘రక్ష’ యోజన

- బీమా వల్ల ప్రయోజనాలు అనేకం
- తపాలా శాఖలో బీమా చేసుకునేలా ప్రణాళికలు
- కార్మికుల కుటుంబాలకు ఎంతో మేలు

లక్ష్మీపురం: కార్మిక కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం విస్తృత బీమా పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రమాదవశాత్తూ మరణించిన, ప్రమాదం వల్ల శరీరంలో ఏదైన భాగం నష్టపోయిన ఈ పథకంతో రక్షణ పొందవచ్చు. అదే అంత్యోదయ శ్రామిక్ సురక్ష యోజన. తపాల శాఖ ద్వారా దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రమైన కవరేజీ, రక్షణను అందించడానికి ఉద్దేశించిన దూరదృష్టితో కూడిన బీమా పథకం. 2023 జూలై 8వ తేదీన దేశ వ్యాప్తంగా ప్రవేశ పెట్టారు. 2024 జనవరి నుంచి ఆంధ్రరాష్ట్రంలో కార్మికులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

బీమా చేసుకోవాలంటే..

బీమా ఏడాది మాత్రమే పని చేస్తుంది. రెన్యువల్ చేసుకోవచ్చు. బీమా చేసుకునే వారి అర్హత 18 నుంచి 65 సంవత్సరాల లోపు కలిగి ఉండాలి. ఈ బీమా ఒక్కొక్కరి చొప్పున చేసుకోవాలి ప్రధానంగా బీమా ప్రయోజనాలు ప్లాన్–ఏ కింద క్యాపిట్ ప్రయోజనాలు(బీమా చేయబడే మొత్తం రూ.10 లక్షలు), ప్లాన్–బి (బీమా చేయబడే మొత్తం రూ.5 లక్షలు) బీమా చేయబడే మొత్తం నూరు శాతం అందించేలా పథకాన్ని రూపొందించారు.

హాస్పిటల్ ఖర్చులు...

ప్రమాదవశాత్తూ హాస్పిటలైజేషన్ ఖర్చులు ఇన్‌పేషెంట్ హాస్పిటలైజేషన్ కవర్ కోసం ప్లాన్–ఏలో అయితే రూ.లక్ష ఇండెమ్నిటీ కవర్, 24 గంటలు ఆస్పత్రిలో ఉండి పోవాల్సి వస్తుంది.



అంత్యోదయ శ్రామిక్ సురక్ష యోజన బీమా పథకం

గది క్యాటగిరి జనరల్ వార్డు మాత్రమే. అదే విధంగా ప్లాన్–బీ రూ.50 వేలు లేదా యధార్థంగా క్లైయిమ్ చేసిన మొత్తం(ఏది తక్కువ అయితే అది) 24 గంటలు ఆస్పత్రిలో ఉండాలి.

ప్రయోజనం..

కన్వెలెన్స్ ప్రయోజనం (పొడిగించబడిన హాస్పిటలైజేన్ ప్రయోజనం)ఏడు రోజులు అయితే ప్లాన్–ఏ ప్రకారం ప్రమాదం సంభవిస్తే పాలసీ వ్యవధిలో 7 రోజుల మించి కొనసాగుతున్న వ్యవధికి ఆస్పత్రిలో ఉంటే రూ.10 వేలు చెల్లించబడుతుది. ఒక సారి లభించే ప్రయోజనం అందుబాటులో ఉంటుంది. ప్లాన్–బీ ఏది లభ్యం కాదు.

దహన సంస్కారాల ఖర్చు..

దహన సంస్కారాల ఖర్చులు, పార్థివ శరీరాన్ని వేరే చోటుకు పంపడం అయినట్లు అయితే ప్లాన్ –ఏ రూ.5 వేలు లేదా యదార్థమైన ఖర్చులు ఏది తక్కువ అయితే అది, ప్లాన్–బీ రూ.5 వేలు లేదా ఖర్చులు ఏది తక్కువ అయితే అది అందుతుంది.

ప్రమాదాలు జరిగితే..

ప్రమాదాలు జరిగితే కోమా కేర్ అయితే ప్లాన్–ఏ పాలసీ వ్యవధిలో రూ. లక్ష ఒకే సారి లభించే ప్రయోజనం దక్కుతుంది. ప్లాన్–బీ పాలసీ వ్యవధిలో రూ.50 వేలు ఒకే సారి లభించే ప్రయోజనం దక్కుతుంది.

దరఖాస్తు ఇలా....

అంత్యోదయ శ్రామిక్ సురక్ష యోజన ద్వారా లబ్ధి పొందాలనుకునే కార్మికులు ముందుగా సంబంధిత కార్మిక శాఖ నుంచి కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన శ్రామిక్ కార్డుదారుడై ఉండాలి. శ్రామిక్ కార్డు, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్‌తో సంబంధిత పోస్టాఫీసులో ఐపీపీబీ(ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్) ద్వారా ఖాతా తెరవబడి అంత్యోదయ శ్రామిక్ సురక్ష యోజనలో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్లాన్– ఏ, ప్లాన్– బీ అని రెండు పద్ధతులు ఉన్నాయి. కార్మికుడు రెండింటినీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఈ నెలలో దరఖాస్తు చేసుకునే వారికి ఏడాది పూర్తి అయిన వెంటనే సంబంధిత బ్యాంక్ ఖాతాలో నగదు ఉన్నట్లయితే మరలా రెండో ఏడాదికి ఈ బీమా కొనసాగుతుంది.

పిల్లల విద్యకు ప్రయోజనం..

ఈ స్కీమ్‌లో పిల్లల విద్య ప్రయోజనంలో ప్లాన్–ఏ బీమా చేయబడిన వ్యక్తి ప్రమాదం కారణంగా మరణిస్తే గరిష్టంగా ఇద్దరు అర్హత కల పిల్లలకు రూ. లక్ష లభిస్తుంది. ప్లాన్–బీలో ఏది లభ్యం కాదు.

ప్రీమియం..

శ్రామిక్ సురక్ష యోజనలో గ్రాస్ ప్రీమియం జీఎస్టీతో సహా ప్లాన్– ఏ రూ.499, ప్లాన్–బీ రూ.289లు చెల్లించాల్సి ఉంటుంది.

ప్రకాశం జట్టుపై గుంటూరు విజయం



131 పరుగులు చేసిన వసంత్ వర్ధన్

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు ఏసీఏ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్– 23 అంతర్ జిల్లాల వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. ప్రకాశం, గుంటూరు జిల్లాల జట్ల మధ్య బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో గుంటూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు 47.5 ఓవర్లకు 288 పరుగులు చేసి ఆలౌట్ అయింది. డి.వసంత్ వర్ధన్ 155 బంతులు ఎదుర్కొని 131 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 47.3 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 266 పరుగులు చేసింది. దీంతో 22 పరుగుల తేడాతో గుంటూరు జట్టు విజయం సాధించింది. ప్రకాశం జట్టు బౌలర్ కె.సాత్విక్ 9.5 ఓవర్లు వేసి ఐదు వికెట్లు తీశాడు.